సాక్షి పల్నాడు

శనివారం । 17 । జూన్ । 2023



దుర్గమ్మ సేవలో ట్రాన్స్‌కో ఎండీ

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను ఏపీ ట్రాన్స్‌కో ఎండీ చక్రధర్‌బాబు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.



ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఫలితంగా క్యూలైన్లు కిటకిటలాడాయి.



హైవే బస్టాండ్‌కు శంకుస్థాపన

జగ్గయ్యపేట అర్బన్: హైవే వద్ద ఏపీఐఐసీ స్థలంలో హైవే బస్టాండ్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు జూనియర్ బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం 8 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో జూనియర్ బాలుర బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి యరగాని శ్రీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2005 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన జట్టును ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరులోనే నిర్వహించే అంతర్ జిల్లాల పోటీల్లో ఆడిస్తామని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డుతోపాటు, రెండు ఫొటోలు తీసుకు రావాలని పేర్కొన్నారు.

41,270 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 38,361 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 41,270 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,700 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.10,000 నుంచి 23,800 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి రూ. 24,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,571 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి లా సెట్‌లో స్టేట్ 9వ ర్యాంకు




చీరాల అర్బన్: బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన కాటూరి కోదండపాణి హైదరాబాద్‌లో విప్రోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ లాసెట్ రాశాడు. శుక్రవారం విడుదలైన లాసెట్ ఫలితాల్లో 91 మార్కులతో స్టేట్ 9వ ర్యాంకు సాధించాడు. ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా సొంతంగా చదివి పరీక్ష రాసి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం విశేషం.

19 నుంచి వైద్యసిబ్బంది బదిలీలు


గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు సాధారణ బదిలీలు జరుగుతాయని ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 19 కేడర్లకు చెందిన వైద్య సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు 579 మంది సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.20 అడుగుల వద్ద ఉంది. ఇది 149.6410 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. మొత్తం ఔట్ ఫ్లో 450 క్యూసెక్కులు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 450 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.10 అడుగుల వద్ద ఉంది. ఇది 33.8136 టీఎంసీలకు సమానం.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,700, మోడల్ ధర రూ.2,700 వరకు పలికింది.

ట్రిపుల్ ఐటీ.. మేటీ

- పదో తరగతితోనే ఆరేళ్ల ఇంజినీరింగ్ కోర్సు
- ప్రతిభే ప్రవేశానికి ప్రామాణికం
- రెండేళ్లు పీయూసీ, నాలుగేళ్లు బీటెక్
- రాష్ట్రంలో నాలుగు కళాశాలలు
- నోటిఫికేషన్ విడుదల
- ఈనెల 26వ తేదీ తుది గడువు



నూజివీడు ట్రిపుల్ ఐటీ

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన పేద విద్యార్థులు నేరుగా ఇంజినీరింగ్ కోర్సు చేసేందుకు ఉన్న సదవకాశం ట్రిపుల్ ఐటీ. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మానస పుత్రికగా 2008లో ట్రిపుల్ ఐటీ ఆవిర్భవించింది. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి రూపకల్పన చేసి దాని పరిధిలో ట్రిపుల్ ఐటీ కళాశాలలను వైఎస్సార్ ఏర్పాటు చేశారు. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ విద్యార్థులకు ఉపయోగపడేలా నూజివీడు, బాసర, ఇడుపులపాయల్లో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను ఏర్పాటు చేశారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నేరుగా ఈ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. రాష్ట్ర విభజన అనంతరం ప్రస్తుతం నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళంలలో ట్రిపుల్ ఐటీ కళాశాలలు ఉన్నాయి.

ఒక్కో కళాశాలలో వెయ్యి సీట్లు

రాష్ట్రంలో ఆర్జీయూకేటీ పరిధిలో నాలుగు ట్రిపుల్ ఐటీ కళాశాలలు ఉన్నాయి. ఏలూరుజిల్లా నూజివీడు, ప్రకాశం జిల్లా ఒంగోలు, వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో 1,000 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ కోటాలోని మరో 400 సీట్లు కలిపి మొత్తం 4,400 సీట్లు భర్తీ చేయనున్నారు. వీటిలో 85 శాతం లోకల్, 15 శాతం నాన్‌లోకల్‌కు కేటాయిస్తారు. వీటికి అదనంగా 5 శాతం సూపర్‌న్యూమరీ సీట్లు అందుబాటులో ఉంచుతారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఏడాదికి రూ.1.50 లక్షలు చెల్లించి ఈ కేటాగిరిలోని సీట్లలో ప్రవేశాలు పొందవచ్చు.

ఆరేళ్ల కోర్సు

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆరేళ్ల సమీకృత బీటెక్ ఇంజినీరింగ్ కోర్సు చదవాల్సి ఉంటుంది. మొదటి రెండేళ్లు పీయూసీ (ప్రీ యూనివర్సిటీ కోర్స్), మిగిలిన నాలుగేళ్లలో ఎంపిక చేసుకున్న బీటెక్ కోర్స్ పూర్తి చేయాలి. మొదటి రెండేళ్ల పీయూసీ కోర్సులో తెలుగు, సంస్కృతం, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లతోపాటు మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయాలజీ సబ్జెక్టులు ఉంటాయి. రెండేళ్ల కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు తమకు ఇతర అవకాశాలు వస్తే అంతటితో బయటకు వెళ్లిపోవచ్చు. వారికి పీయూసీ ఉత్తీర్ణత సర్టిఫికెట్ అందజేస్తారు. ట్రిపుల్ ఐటీ ఏర్పాటు లక్ష్యం ఇంజినీరింగ్ కావటంతో అధిక శాతం విద్యార్థులు మిగిలిన నాలుగేళ్లు పూర్తి చేసుకొని బీటెక్ పట్టాతో బయటకు వెళుతుంటారు. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మెటాలార్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులో ఉంటాయి.

రిజర్వేషన్ల వారీగా సీట్ల కేటాయింపు ఇలా..

సాధారణ ప్రవేశాలు రిజర్వేషన్లను అనుసరించి సీట్ల భర్తీ ఉంటుంది. వీటిలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీ 6, బీసీ ఏ 7, బీసీ బీ 10, బీసీ సీ 1, బీసీ డీ 7, బీసీ ఈ 4, సైనిక సంతతి 2, ఎన్‌సీసీ 1, క్రీడలు 0.5, దివ్యాంగులు 5 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తారు. బాలికలకు అన్ని కేటగిరీలలో 33 శాతం కేటాయిస్తారు. ఈ ఏడాది దివ్యాంగులకు 3 శాతం నుంచి 5 శాతానికి రిజర్వేషన్‌ను ప్రభుత్వం పెంచింది. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుంది. ప్రస్తుతం ఉన్న 4,000 సీట్లలో 600 సీట్లు నాన్ లోకల్‌కు కేటాయించగా మిగిలిన 3,400 సీట్లను 26 జిల్లాలకు సమానంగా కేటాయిస్తారు. దీంతో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మాత్రమే సీటు లభిస్తుంది. ఇద్దరు విద్యార్థులకు సమాన మార్కులు వస్తే గణితం, జనరల్ సైన్స్, ఇంగ్లిష్‌లో అధిక మార్కులు వచ్చిన వారికి తొలి ప్రాధాన్యమిస్తారు. అప్పటికీ ఇద్దరూ సమానంగా నిలిస్తే సాంఘిక శాస్త్రం, ఫస్ట్ లాంగ్వేజ్‌లలో మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. అప్పటికీ సమానంగా నిలిస్తే పుట్టిన తేదీ ప్రకారం అధిక వయస్సు ఉన్నవారిని ఎంపిక చేస్తారు.

లోకల్.. నాన్‌లోకల్..

ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశాలకు లోకల్, నాన్‌లోకల్ రిజర్వేషన్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉమ్మడి జిల్లాలైన గుంటూరు, ప్రకాశం, కృష్ణా, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి జిల్లాలలోని విద్యార్థులను లోకల్‌గాను, మిగిలిన జిల్లాల వారిని నాన్ లోకల్‌గాను పరిగణిస్తారు. అలాగే వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, నెల్లూరు జిల్లాల విద్యార్థులను లోకల్‌గానూ, మిగిలిన జిల్లాల వారిని నాన్ లోకల్‌గాను పరిగణిస్తారు.

నోటిఫికేషన్ విడుదల..

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈనెల 4 నుంచి 26 సాయంత్రం 5 గంటల వరకు వర్సిటీ వెబ్‌సైట్‌లో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.200, మిగిలిన విద్యార్థులు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. ఎంపికైన విద్యార్థుల జాబితాను జూలై 13న ప్రకటిస్తారు.

ప్రతిభే ప్రామాణికం

ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశానికి ప్రతిభే ప్రామాణికం. పదో తరగతి పరీక్షలో విద్యార్థి చూపిన ప్రతిభ, మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులకు నాలుగు శాతం గ్రేస్ పాయింట్లను అదనంగా కలుపుతారు.

సర్టిఫికెట్ల పరిశీలన

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కోసం కౌన్సెలింగ్‌కు హాజరుకావలసి ఉంటుంది. నూజివీడు కళాశాలలో జూలై 5 నుంచి 9 వరకు దివ్యాంగులు, క్రీడలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ, క్యాప్ తదితర ప్రత్యేక కేటగిరి కోటా విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. జూలై 13న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తారు. నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు జూలై 21, 22తేదీలలోనూ, ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లను జూలై 24, 25తేదీలలో ఇడుపులపాయ క్యాంపస్‌లోనూ, శ్రీకాకుళం క్యాంపస్‌లో జూలై 24, 25తేదీలలో విద్యార్థులు తమ సర్టిఫికెట్ల పరిశీలనను పూర్తిచేసుకోవాలి.

వీధి కుక్కలను చంపిన ఉద్యోగులపై చర్యలు

- గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్
- డీఎల్‌పీఓకు షోకాజ్ నోటీసు
- కలెక్టర్ శివశంకర్ ఆదేశాలు

నరసరావుపేట: వీధి కుక్కలను పట్టుకొని అవగాహన లోపంతో ఇంజెక్షన్లు చేసి చంపిన ఉద్యోగులపై కలెక్టర్ ఎల్.శివశంకర్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ గ్రామంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, వాటి నుంచి రక్షణ కల్పించాలంటూ ఇటీవల ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామవాసులు స్పందనలో కలెక్టర్‌ను కోరారు. దీంతో కుక్కలను పట్టుకోవాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈమేరకు చర్యలు చేపట్టిన గ్రామ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ హైమావతి కుక్కలు పట్టుకునే బృందం ద్వారా 70 నుంచి 100 కుక్కలకు ఇంజక్షన్లు ఇప్పించారు. దీంతో అవి చనిపోయాయి. ఫలితంగా విధుల్లో బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయటంతోపాటు ఈపూరు విస్తరణాధికారి, డివిజనల్ పంచాయతీ అధికారులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామ సర్పంచ్‌ను మందలించారు. జిల్లా వ్యాప్తంగా వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ఏఆర్‌వీ ఇంజక్షన్లు మాత్రమే చేయాలని కలెక్టర్ సూచించారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరు): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అనకాపల్లి, తాడి స్టేషన్ల మధ్య పనులు జరుగుతున్న నేపథ్యంలో గుంటూరు డివిజన్ మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లను రద్దు చేసినట్లు గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. గుంటూరు–విశాఖపట్నం (17239), విశాఖపట్నం–విజయవాడ(22701), విజయవాడ–విశాఖపట్నం (22702), మచిలీపట్నం– విశాఖపట్నం (17219) రైళ్లను శనివారం రద్దు చేసినట్టు తెలిపారు. విశాఖపట్నం–గుంటూరు (17240), విశాఖపట్నం–మచిలీపట్నం (17220) రైళ్లను ఆదివారం రద్దు చేసినట్టు వివరించారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన అవసరం

రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయ జేడీఏ కృపాదాస్



మాట్లాడుతున్న జేడీఏ కృపాదాస్, నున్న వెంకటేశ్వర్లు, ఐ.మురళి తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన చట్టాలపై వ్యవసాయశాఖ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయం జేడీఏ వి.డి.వి.కృపాదాస్ సూచించారు. గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ చట్టాలపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయాధికారులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందించడంలో వ్యవసాయ చట్టాల ప్రాముఖ్యత, వాటి అమలును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. జేడీఏ కృపాదాస్ మాట్లాడుతూ నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులే లక్ష్యంగా వ్యవసాయ చట్టాలు తయారు చేసినట్టు వివరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేసే ప్రైవేటు కంపెనీలు, డీలర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్సు లేకుండా అనధికారికంగా విక్రయించేవారిపై కఠిన చర్యలకు సిద్ధం కావాలన్నారు. కమిషనరేట్ కార్యాలయం ఏడీఏలు సుదర్శన్ రాజు, ఎస్.వెంకటేశ్వర్లు విత్తన చట్టాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎరువులు, పురుగుమందుల చట్టాలపై కమిషనరేట్ కార్యాలయం ఏడీఏ ఎ.మద్దులేటి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయ అధికారులు నున్న వెంకటేశ్వర్లు, అబ్దుల్ సత్తార్, ఐ.మురళి, కమిషనరేట్ కార్యాలయం డీడీఏ జి.సుజాత, మూడు జిల్లాల ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు
- సీనియర్ పాత్రికేయులకు సన్మానం, ముఖాముఖి



సీనియర్ పాత్రికేయులను సన్మానిస్తున్న కొమ్మినేని, కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, బొల్లా.

నరసరావుపేట: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తన స్థాయిలో కృషిచేస్తున్నానన్నారు. 104 ద్వారా అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ప్రతినెలా ఒక మెడికల్ క్యాంపు నిర్వహించాలని ప్రతిపాదించామన్నారు. జర్నలిస్టులు కేవలం వార్తలే కాకుండా పుస్తక రచనలు కూడా చేయాలని, వారు రచించిన పుస్తకాలను గ్రంథాలయాల్లో ప్రాధాన్య క్రమంలో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమాభివృద్ధిని నిజాయితీగా విశ్లేషణ చేయాలన్నారు. పాత్రికేయులు, మీడియా సంస్థలకు అజెండాలు ఉండటం సహజమేనని, కానీ వ్యక్తిగత అజెండాలతో రాసే కథనాలు రాష్ట్ర పురోగతిని అడ్డుకునేలా ఉండకూడదన్నారు. అకాడమీ చైర్మన్‌గా నాలుగు నెలల వ్యవధిలో 40కుపైగా క్షేత్రస్థాయి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సన్మానం పొందిన కేవీకే రామారావుతో తనకు 45ఏళ్ల అనుబంధం ఉందన్నారు. తానీ స్థాయికి ఎదగడంలో రామారావు పాత్ర కూడా ఉందన్నారు. మడకా సత్యనారాయణ, రామారావు నేటితరం పాత్రికేయులకు ఆదర్శమన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ పత్రికా పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొమ్మినేని పాత్రికేయ రంగంలో హీరోలాంటి వారని కొనియాడారు. విపత్కర పరిస్థితుల్లో జర్నలిస్టుల పనితీరు మెచ్చుకోదగిందన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా ఉండే జర్నలిస్టు కొమ్మినేని అని చెప్పారు. జర్నలిస్టులలో ఆయనది ప్రత్యేక శైలి అన్నారు. తన నియోజకవర్గంలో ప్రతి జర్నలిస్టుకూ రెండు సెంట్ల స్థలంలో 100పైగా ఇళ్లతో కాలనీ నిర్మించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అనంతరం నరసరావుపేటకు చెందిన ప్రముఖ పాత్రికేయులు కె.వి.కె రామారావు, జర్నలిస్టు, మాజీ అధ్యాపకులు మడకా సత్యనారాయణను సన్మానించారు. పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్, నరసరావుపేట తరఫున పాత్రికేయులు సమస్యలపై కొమ్మినేనికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయనను సన్మానించారు. పొడా చైర్‌పర్సన్ మిట్టపల్లి రమేష్, మీడియా అకాడమీ సెక్రటరీ బాలగంగాధర్ తిలక్, నరసరావుపేట, రొంపిచెర్ల జెడ్పీటీసీ సభ్యులు పి.ఓబుల్‌రెడ్డి, పదముత్తం చిట్టిబాబు, పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు బి.ప్రసాదరావు, సీహెచ్.వి.రమణారెడ్డి, పి.నాగరాజు, జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దసంఖ్యలో పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన ఉప్పాలవారిపాలెం

- అమర్‌నాథ్ హత్యతో విషాదఛాయలు
- తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

చెరుకుపల్లి: మండలంలోని రాజవోలు గ్రామ పరిధిలోని ఉప్పాలవారిపాలెం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్‌నాథ్(15) హత్యతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. గ్రామస్తులంతా అమానుష చర్యను ఖండిస్తున్నారు.

సోదరిని టీజింగ్ చేయడంతో మొదలైన గొడవ

అమర్‌నాథ్ సోదరిని గ్రామానికే చెందిన పాము వెంకటేశ్వరరెడ్డి(వెంకి) గతంలో టీజింగ్ చేయడంతో గొడవ మొదలైంది. దీనిపై అమర్‌నాథ్ వెంకటేశ్వరరెడ్డిని నిలదీశాడు. ఆ తర్వాత పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. పాఠశాలల పునఃప్రారంభమైన తర్వాత అమర్‌నాథ్ బడికి వెళ్లి వచ్చే క్రమంలో అడ్డగించి వెంకటేశ్వరరెడ్డి గొడవ పడుతున్నాడు. ఈ విషయమై అమర్‌నాథ్ తాత ఉప్పాల రెడ్డియ్య, నానమ్మ ధనలక్ష్మి, తల్లి మాధవి వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు చెప్పారు. కొడుకును అదుపులో పెట్టుకోవాలని సూచించారు. దీంతో మరింత కక్ష పెంచుకున్న వెంకటేశ్వరరెడ్డి మరో ముగ్గురితో కలిసి శుక్రవారం ట్యూషన్‌కు వెళ్తున్న అమర్‌నాథ్‌ను అడ్డగించి దాడి చేసి పెట్రోల్ పోసి నిప్పటించి పరారయ్యాడు. స్థానికులు గమనించి మంటలు ఆర్పి అమర్‌నాథ్‌ను గుంటూరు ప్రభుత్వాస్పత్రి తరలించగా, అక్కడ మరణించాడు.

గుండెలవిసేలా రోదిస్తున్న నానమ్మ, సోదరి

అమర్‌నాథ్ మృతితో అతడి నానమ్మ గుండెలవిసేలా రోదిస్తోంది. 13 ఏళ్ల క్రితం కొడుకు చనిపోయాడని, కోడలు, చిన్నపిల్లలను తమ వద్దే ఉంచుకుని వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని విలపించింది. మాపై ఎందుకంత పగబట్టావు దేవుడా అంటూ కన్నీరుమున్నీరవుతోంది. వృద్ధురాలి వేదన స్థానికులను కంటతడి పెట్టించింది. తమ్ముడిని హత్య చేశారని తెలిసిన అమర్‌నాథ్ సోదరి కూడా తీవ్రంగా విలపించి సొమ్మసిల్లి పడిపోయింది. అమర్‌నాథ్ ఇంటి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. అతడి తల్లి మాధవి, తాత ఉప్పాల రెడ్డియ్య గుంటూరు ఆస్పత్రికి వెళ్లారు.

గ్రామంలో పోలీసు బందోబస్తు

అమర్‌నాథ్ హత్యతో గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ వకుల్‌జిందాల్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ మహేష్ పరిశీలించారు. సీఐలు రాజమోహన్, శివశంకర్ పర్యవేక్షణలో ఎస్‌ఐలు కొండారెడ్డి, రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ మహేష్ చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పరిస్థితిపై సమీక్షిస్తున్నారు.



మృతుడు అమర్‌నాథ్ ఇంటి వద్ద విలపిస్తున్న బంధువులు

గుంటూరు స్టేషన్‌ను సందర్శించిన రైల్వే ఐజీ



మాట్లాడుతున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారామ్

లక్ష్మీపురం(గుంటూరు): సెక్యూరిటీ మోడరన్ గార్డ్ గైడ్స్ వాహనాన్ని దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తిరుపతి, సికింద్రాబాద్ తరువాత గుంటూరు రైల్వే డివిజన్‌లోనే ఆవిష్కరించినట్టు సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారామ్ చెప్పారు. గుంటూరు రైల్వే స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. డివిజన్ రైల్వే ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం సెక్యూరిటీ మోడరన్ గార్డ్ గైడ్స్ వాహనాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌లో భద్రత అంశాలు బాగున్నాయని వివరించారు. ప్లాట్‌ఫాంల తనిఖీకి గార్డ్ గైడ్స్ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఆర్పీఎఫ్ పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్‌లోని ఆర్పీఎఫ్ స్టేషన్‌ను, సిబ్బంది బ్యారెట్స్‌ను, డాగ్ స్క్వాడ్ భవనాన్ని పరిశీలించి, డాగ్ స్క్వాడ్ భవనంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ హరిప్రసాద్, రైల్వే ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పది గ్రాముల డ్రగ్ స్వాధీనం

ఒక యువకుడు, బాలుడు అరెస్ట్

తాడేపల్లిరూరల్ : నరాలను ఉత్తేజపరిచే డ్రగ్ మెథాంఫేటమిన్‌ను తాడేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకుని ఒక యువకుడిని, ఒక బాలుడిని అదుపులోకి తీసుకుని శుక్రవారం కోర్టుకు హాజరుపరిచారు. తాడేపల్లి సీఐ శేషగిరి కథనం ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం త్రినాథపురానికి చెందిన యాగంటి శ్రీచందు పంజాబ్‌లోని ఓ యూనివర్శిటీలో చదువుకుంటున్న సమయంలో నిషేధిత డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. గుజరాత్‌లోనూ ఇతనిపై గంజాయి కేసు నమోదైంది. అక్కడి నుంచి స్వగ్రామం వచ్చిన శ్రీచందు తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ సాఫ్ట్‌వేర్ కోచింగ్ సెంటర్‌లో ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. ఇదే క్రమంలో వడ్డేశ్వరం చుట్టుపక్కల గంజాయి తాగేవారిని పరిచయం చేసుకుని తన వద్ద మెథాంఫేటమిన్ ఉందని, దానిని విక్రయిస్తానని చెప్పాడు. వడ్డేశ్వరంలో చదువు మానేసి ఖాళీగా ఉన్న ఓ బాలుడిని పరిచయం చేసుకుని అతడికి డ్రగ్‌ను అమ్ముతానని చెప్పాడు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, డీఎస్పీ రాంబాబు ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి విక్రేతలపై నిఘా పెట్టిన తాడేపల్లి ఎస్‌ఐ రమేష్, సిబ్బంది శుక్రవారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు కొలనుకొండలోని సర్వీస్ రోడ్ వద్ద శ్రీచందు, బాలుడికి డ్రగ్‌ను అందజేస్తుండగా దాడి చేశారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న 10 గ్రాముల మెథాంఫేటమిన్ స్ఫటికలు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. శ్రీచందు ఈ డ్రగ్‌ను తెప్పించడం ఇదే మొదటిసారని, ఢిల్లీ నుంచి దీనిని కొయ్యలగూడెంకు తెప్పించి అక్కడి నుంచి ఇక్కడకు తీసుకొచ్చినట్టు సీఐ తెలిపారు.

మహిళలకు దిశ యాప్ వజ్రాయుధం

- ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి
- జిల్లావ్యాప్తంగా డౌన్‌లోడు
- పోలీసుల ప్రత్యేక డ్రైవ్



రాజుపాలెంలో దిశయాప్ డౌన్‌లోడు చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది



పిడుగురాళ్ల పట్టణంలో దిశయాప్ డౌన్‌లోడు చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: ఆపద సమయంలో మహిళలకు దిశ యాప్ వజ్రాయుధం లాంటిదని, దీన్ని ఉపయోగించి పోలీసుల సహాయం తీసుకోవాలని జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ స్ఫూర్తితో, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు, మహిళా పోలీసులు కలసి దిశా యాప్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. స్టేషను పరిధిలోని గ్రామాలు, ముఖ్య కూడళ్లు, విద్యా సంస్థలు, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలు, బస్టాండులు, రైల్వేస్టేషన్లు వద్ద ప్రజలతో యాప్ డౌన్‌లోడు చేయించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులపై లైంగిక వేదింపులు, అఘాయిత్యాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దిశా యాప్ తీసుకోచ్చిందని చెప్పారు. ఈ యాప్ ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్‌లో ఉండాలని తెలిపారు. ఆపద సమయంలో యాప్ వినియోగించే విధానం, రక్షణ గురించి వివరించడంతో పాటు మొబైల్ ఫోన్లలో యాప్ డౌన్‌లోడు, రిజిస్ట్రేషన్ చేయించామని చెప్పారు. యాప్ ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది మహిళల్ని పోలీసులు రక్షించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ యు.రవిచంద్ర, జిల్లాలోని వివిధ స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బంది , సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

27 నుంచి రాష్ట్రస్థాయి యువజన సమ్మేళనం

పాత గుంటూరు: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి యువజన విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో విలేకరుల సమావేశంలోపోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతరాన్ని బాధ్యతలవైపు మరల్చి , త్యాగపూరిత పోరాటాల వైపు సమాయత్తం చేయడానికి ఈసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఊర్లోనే రిజిస్ట్రేషన్

- గ్రామ సచివాలయాల్లో ప్రారంభమైన సేవలు
- చలానా, డాక్యుమెంట్లు రాయడం, ఫీజుల చెల్లింపు తదితరవన్నీ అక్కడే
- రిజిస్ట్రేషన్ సేవలకు జిల్లాలో 51 సచివాలయాల ఎంపిక
- విడతల వారీగా అన్నింటికీ విస్తరణ
- జాయింట్ సబ్ రిజిస్ట్రార్-3గా సచివాలయ కార్యదర్శి
- గ్రామీణులకు తప్పనున్న వ్యయప్రయాసలు

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోంది. ఇప్పటికే ఊరూరా ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని సేవలు అందిస్తున్న సర్కారు ఆస్తుల రిజిస్ట్రేషన్ కూడా అందుబాటులోకి తెచ్చింది. ప్రయోగాత్మకంగా జిల్లాలో ఒక సచివాలయం ద్వారా ప్రారంభించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో గురువారం నుంచి 14 మండలాల్లోని 51 సచివాలయాల్లో అమలుకు అధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో సుదూర ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు పొందవచ్చు.



రెంటపాళ్లలో రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది, పక్కన తహసీల్దార్ సురేష్

సత్తెనపల్లి: జిల్లాలో గతంలో ఏ రకమైన రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా సుదూర ప్రాంతాల్లోని రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలి. ఇందుకు ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. దీనికి తోడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద దళారుల దోపిడీ. వీటన్నింటికీ చెక్ పెట్టి స్థానికంగా ఉన్న గ్రామ/వార్డు సచివాలయాల్లోనే అన్ని రకాల రిజిస్ట్రేషన్ సేవలు అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి గురువారం నుంచి అమలుకు శ్రీకారం చుట్టాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా సచివాలయాలు

ప్రస్తుతం పల్నాడు జిల్లావ్యాప్తంగా 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలంటే రెండు నుంచి మూడు రోజులు వాటి చుట్టూ తిరగాలి. అయినా సకాలంలో పని పూర్తవుతుందో లేదో తెలియదు. ఇక నుంచి ఇబ్బంది లేకుండా చెంతనే ఉన్న సచివాలయాల్లో సులభంగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చు. జిల్లావ్యాప్తంగా రీ సర్వే పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో కొన్నింటిని ఎంపిక చేశారు. అందులో జిల్లాలో 14 మండలాల్లోని 51 సచివాలయాలు ఎంపిక చేయగా, దానిలో సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామ సచివాలయం కూడా ఉంది. వీటిలో నూతనంగా రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించనున్నారు. ఇలా విడతల వారీగా మరో ఏడాదిలోపు జిల్లాలోని అన్ని గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించేందుకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.



డాక్యుమెంట్‌ను అందిస్తున్న తహసీల్దార్ సురేష్, సచివాలయ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్

భూ రీ సర్వేతో కబ్జాలకు చెక్

ఎప్పుడో బ్రిటిష్ పరిపాలనలో చేసిన సర్వేనే ఇప్పటికీ ఆధారం. దీంతో భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు గందరగోళంగా ఉన్నాయి. ఫలితంగా గ్రామాల్లో భూ వివాదాలు పెరిగి పోతున్నాయి. కొన్నిచోట్ల ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడుతున్నారు. ఇకపై ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా సర్వే నంబర్లలో సబ్ డివిజన్లకు ప్రభుత్వం స్వస్తి పలుకుతోంది. ఉదాహరణకు 1, 1ఏ, 1బి, 1 బి / ఏ లాంటి సబ్ డివిజన్ సర్వే నంబర్లు ఇక నుంచి ఉండవు. సర్వే నంబర్ 1,2 ఇలా ఒకే నంబర్ ఉంటాయి. ఇప్పటి వరకు సబ్ డివిజన్లు సృష్టించి అక్రమాలకు పాల్పడుతూ వచ్చారు. ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న భూ రీ సర్వేలో ఊరు, సచివాలయ పరిధి, మండలం కనబరుస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ పక్కాగా ఉంటుంది.ఒకరి భూమిని మరొకరు కబ్జా చేసే పరిస్థితి ఉండదు.

సచివాలయాల్లో అందించే రిజిస్ట్రేషన్ సేవలు ఇవే ..

అక్నాలెడ్జ్ మెంట్ అప్‌లోడ్, డేటా ఫీడింగ్, చెక్ స్లిప్, రెగ్యులర్ నంబర్ కేటాయింపు, ఫొటో, వేలిముద్రలు తీసుకోవడం, డాక్యుమెంట్ ప్రింటింగ్, స్కానింగ్, విక్రయ దస్తావేజు, సెటిల్ మెంట్ దస్తావేజు, దాన విక్రయం, తనఖా, చెల్లు రసీదు, భాగ పరిష్కారం రిజిస్ట్రేషన్ రద్దు, మ్యానువల్ ఈసీ, ఆన్‌లైన్ ఈసీ, మార్కెట్ వాల్యుయేషన్ సర్టిఫికెట్, వివాహ రిజిస్ట్రేషన్ తదితర సేవలు అందిస్తారు.

జిల్లాలో రీ సర్వే పూర్తయి రిజిస్ట్రేషన్ సేవలకు అనువుగా ఉన్న సచివాలయాలు

మండలం	సచివాలయాలు
చిలకలూరిపేట	చిన్నపసుమర్రు, గొట్టిపాడు, కంతేటివారికండిక, మానుకొండవారిపాలెం, తాతాపూడి, వేలూరు.
దాచేపల్లి	అలుగుమల్లెపాడు, ముత్యాలం పాడు.
ఎడ్లపాడు	జాలాది, కారుచోల, మర్రిపాలెం మైదవోలు, సందెపూడి, విశ్వనా ధునికండ్రిక.
ఈపూరు	వనికుంట.
క్రోసూరు	పారుపల్లె, పీసపాడు.
మాచవరం	చెన్నాయపాలెం, శ్రీరుక్మిణీపురం
నాదెండ్ల	చందవరం, చిరుమామిళ్ల, కనుపర్రు, సంకురాత్రిపాడు.
నకరికల్లు	నరసింగపాడు, త్రిపురాపురం.
నరసరావుపేట	దొండపాడు, అగ్రహారం, గుంటగార్ల పాడు, ఇక్కుర్రు, జొన్నలగడ్డ, పాలపాడు, పెట్లూరివారిపాలెం, పోతవరప్పాడు, ఉప్పలపాడు.
నూజండ్ల	పెద్దవరం, టిఅన్నవరం, తెల్లబాడు.
పిడుగురాళ్ల	చిన్న అగ్రహారం, పెద్ద అగ్రహారం
రొంపిచర్ల	అన్నవరపాడు, ఆరెపల్లి అగ్రహారం, ముంతానపల్లె, నలగర్లపాడు.
సత్తెనపల్లి	రెంటపాళ్ల
వినుకొండ	మదమంచిపాడు, నరసరాయనిపాలెం, నరగాయపాలెం, నాయనిపాలెం, పెరుమాళ్లపల్లె, శెట్టుపల్లి, సూరెపల్లె , విఠంరాజుపల్లె.

రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు సిద్ధం



సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌కు ఆరు నెలలుగా సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ కంప్యూటర్‌లో ఇన్‌స్టాల్ చేశారు. కొద్దిపాటి సాంకేతిక సమస్యలు ఉండటంతో వాటిని అధిగమిస్తున్నాం . ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రకాల రిజిస్ట్రేషన్ సేవలను సచివాలయం ద్వారా పొందవచ్చు.

–ఎస్.సురేష్, తహసీల్దార్, సత్తెనపల్లి

పల్నాడులో పట్టుబడ్డ సూపర్‌బజార్ దొంగలు

- ఆరునెలల అనంతరం కొలిక్కి వచ్చిన దొంగతనం
- నిందితులను అదుపులోకి తీసుకొనేందుకు తాడేపల్లి పోలీసుల సన్నాహాలు



సూపర్‌బజార్‌లో దొంగతనాన్ని పరిశీలిస్తున్న సీఐ శేషగిరిరావు (ఫైల్)

తాడేపల్లి రూరల్ : పట్టణ పరిధిలో బైపాస్ రోడ్డు వెంబడి ఉన్న ఉషోదయ సూపర్ మార్కెట్‌లో జరిగిన దొంగతనం కేసులో ఎట్టకేలకు తాడేపల్లి పోలీసులు పురోగతి సాధించారు. ఆ దొంగతనానికి పాల్పడిన నలుగురు వ్యక్తులు పిడుగురాళ్ళలో జరిగిన కారు దొంగతనం కేసులో శుక్రవారం పట్టుబడ్డారు. తాడేపల్లిలోని సూపర్ మార్కెట్‌లో దొంగతనానికి పాల్పడ్డవారు, పోలీసులు అనుమానిస్తున్నది వారేనని నిర్ధారణకు వచ్చారు. అరెస్ట్ అయిన ఆ నలుగురిని అదుపులోకి తీసుకు విచారించేందుకు తాడేపల్లి పోలీసులు సన్నాహాలు ప్రారంభించారు. గుంటూరు అంకిరెడ్డిపాలేనికి చెందిన వడ్లమూడి శివారెడ్డి ఇలాంటి దొంగతనాలకు పాల్పడతాడని అప్పుడే తాడేపల్లి సీఐ శేషగిరిరావు అతనిపై నిఘా ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. కానీ శివారెడ్డి నాలుగు నెలల కాలం నుంచి అంకిరెడ్డి పాలెంలో కాకుండా, కడపలో నివాసముంటున్నాడని బంధువులు తెలియజేశారు. ఆరు నెలల అనంతరం శివారెడ్డి పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో ఓ కారు దొంగతనం చేసి పట్టణ శివారులో పెట్టి నిద్రిస్తుండగా సదరు కారు యజమాని గుర్తించి , పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడు. పిడుగురాళ్ల పోలీసులు చాకచక్యంగా శివారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. పిడుగురాళ్లలో నివాసముంటూ జైలులో పరిచయమైన అంజిరెడ్డి, శ్రీను, కుంభా పెదరోశయ్యతో కలిపి గుంటూరులో ఒక సూపర్ బజార్‌లోను, తాడేపల్లి ఉషోదయ సూపర్ మార్కెట్‌లో రేకులు కట్‌చేసి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. అయితే, ఉషోదయ సూపర్ మార్కెట్‌లో తాము దొంగిలించింది 7 లక్షల రూపాయలు మాత్రమేనని, సూపర్‌బజార్ యజమాని మాత్రం 13 లక్షలు దొంగిలించినట్లు కేసు పెట్టారని శివారెడ్డి పిడుగురాళ్ల పోలీసులకు చెప్పడం విశేషం.

రెండు లారీలు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- డ్రైవర్ నిద్రమత్తుతో ప్రమాదం
- కోనంకి వద్ద ట్రాఫిక్ అంతరాయం



రహదారికి అడ్డంగా పడి ఉన్న లారీలు

మార్టూరు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొట్టుకోవడంతో ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో కోనంకి ఫ్లైఓవర్ సమీపంలో చోటుచేసుకుంది. హైవే పెట్రోలింగ్ వాహనం ఇన్‌చార్జి నరసింహారావు, అంబులెన్స్ సిబ్బంది కోటేశ్వరరావు వివరాల మేరకు.. బెంగళూరు నుంచి కోల్‌కతాకు 800 టమోటా బాక్సులతో ఓ భారీ వాహనం వెళ్తోంది. కోనంకి ఫ్లైఓవర్ దిగే క్రమంలో డ్రైవర్ అశోక్ నిద్రమత్తు కారణంగా అదుపు తప్పి రహదారికి మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటుకొని, బిహార్ నుంచి కోయంబత్తూరుకు మిషనరీ తరలించే మరో లారీని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు లారీలు మార్టూరు- ఒంగోలు రహదారికి అడ్డంగా పడిపోయాయి. ఈ కారణంగా మధ్యాహ్నం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ వాహన,అంబులెన్స్ సిబ్బందితో పాటు బలికురవ 108 సిబ్బంది తక్షణమే ప్రమాదస్థలికి చేరుకున్నారు. ప్రమాదంలో టమోటా లారీ డ్రైవర్ అశోక్‌కు ఎడమ కాలికి గాయమైంది. ఒంగోలు వైపు వెళ్తున్న రెండో లారీ డ్రైవర్ రాజేష్‌కుమార్, క్లీనర్ శశికుమార్‌కు గాయాలు కావడంతో ముగ్గురిని మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లక్షల రూపాయలు విలువైన టమోటా రోడ్డుపాలు కావడంతో స్థానికులు, వచ్చే పోయే ప్రయాణికులు దొరికిన వారు దొరికినట్లే తీసుకువెళ్లారు. హైవే సిబ్బంది క్రేన్‌ల సాయంతో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న రెండు వాహనాల్ని తీవ్రంగా శ్రమించి మధ్యాహ్నం లోపు తొలగించి, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.

22న జిల్లాస్థాయి యువ ఉత్సవ్

నెహ్రూనగర్: యువతలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు నెహ్రూ యువ కేంద్ర గుంటూరు, హిందూ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో హిందూ కాలేజీలో ఈ నెల 22న జిల్లాస్థాయి యువ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్మయి శుక్రవారం తెలియజేశారు. సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక, జానపద కళలు పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతి, ధ్రువపత్రాలతో పాటు ప్రతిభావంతులకు జాతీయస్థాయి వరకు యువ ఉత్సవ్‌లో వెళ్లే అవకాశం ఉందన్నారు. 15 నుంచి 29 వయస్సులోపున్న యువ ఔత్సాహికులు పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీల్లో పాల్గొనాలని ఆమె తెలిపారు. వివరాలకు 9177753393 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరికెపుడిశెల ప్రాజెక్ట్ నిర్మాణం వెంటనే చేపట్టండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, నాయకులు

నరసరావుపేట: పల్నాటి ప్రజల దశాబ్దాల నాటి కల వరికెపుడిశెల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను రైతు, గిరిజన, కార్మిక, ప్రజా సంఘాల నాయకులతో కలసి వినతిపత్రం సమర్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ వరికెపుడిశెల ప్రాజెక్ట్ నిర్మాణంతో జిల్లాలోని మాచర్ల నియోజకవర్గంలో గల వెల్దుర్తి, దుర్గి, వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి, ప్రకాశం జిల్లాలోని పుల్లలచెరువు మండలాల్లో సుమారుగా లక్ష ఎకరాలకు సాగు నీరు, వంద గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అడ్డంకుల్ని వెంటనే తొలగించి సరిపడా నిధులు కేటాయించి, వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు గద్దె చలమయ్య, ఏపూరి గోపాలరావు, కోటా నాయక్, శ్రీనూ నాయక్, కంబాల ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

కొలకలూరులో మంత్రి నాగార్జున పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి డాక్టర్ నాగార్జున

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున జన్మదినం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొలకలూరి వసంత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సెంటర్‌లో నిర్వహించారు. కనకతప్పెట్లు, బ్యాండ్ మేళాలతో మంత్రి నాగార్జునకు ఘనస్వాగతం పలికారు. టపాసులు కాల్చారు. సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి నాగార్జున కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొలకలూరి నాగేశ్వరరావు, పినపాటి అనిల్‌కుమార్, సత్యానందకుమార్, కోడూరు చింతాల్ బాబు, కేసరి, గాజులవర్తి జింబో, బీసీపోగు రవి, గోరికపూడి ఆంథోను, రావూరి బుల్లబ్బాయి, జోసఫ్, సందీప్, షేక్ బాజీ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాల కల్పనే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

నగరం: రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కల్పన సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను శుక్రవారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వచ్చిన తరువాత ఇప్పటి వరకు 6,16,323 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. నాలుగేళ్ల కాలంలో 2,06,638 మందికి పర్మినెంట్ ఉద్యోగాలు, 37,908 మందికి కాంట్రాక్టు, 3,71,777 మందికి అవుట్‌సోర్సింగ్, ఉద్యోగాలను కల్పించినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో 2014నుంచి 2019 వరకు 34,108 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారని వివరించారు. దేశచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. అనంతరం ఎంపీ మోపిదేవిని కళాశాల పాలకవర్గ సభ్యులు, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 30 కంపెనీల ప్రతినిధులు 1,000 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్, ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, డాక్టర్ గోగినేని హనుమంతరావు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా టీడీపీ నాయకుల మట్టి తవ్వకాలు

నిలిపివేయించిన తహసీల్దార్ సిద్ధార్థ



చెరువు వద్ద మట్టి కోసం క్యూ కట్టిన ట్రాక్టర్లు

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): అనుమతుల్లేకుండా జరుగుతున్న మట్టి త్రవ్వకాలను రెవెన్యూ అధికారులు నిలిపివేయించారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులోని సాధినేనివారి చెరువులో శుక్రవారం ఆ గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టారు. పెద్దఎత్తున తవ్వకాలు జరుగుతుండటంతో ట్రాక్టర్లు క్యూ కట్టాయి. దీంతో స్థానికుల నుంచి తహసీల్దార్ సిద్ధార్థకు ఫిర్యాదులు అందడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. తొలుత గ్రామ వీఆర్ఏను, ఆ తరువాత వీఆర్వోను తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి పంపి నిలిపివేయించారు.